ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 16 పుష్పం : 33-34 05-05-2005



రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 8/-



చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥



పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


02-02-05
గణపవరం ................ 1
ఏది అసలయిన జ్ఞానం
.............................. 13



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-02-05, గణపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధారణంగా ఏవైనా కోరికలు ఉన్నవారు ఆకోరికలు నెరవేరటం కోసం సాయి సచ్చరిత్రము చదువుతూ ఉంటారు. మీరు అందరూ ఆత్మజ్ఞానాన్ని కోరుకోవాలి, మోక్షాన్ని కోరుకోవాలి. మీరు ఏదైతే కోరుకోవాలి అని నేను అనుకొంటున్నానో, మీరు ఏదైతే పొందాలి అని నేను అనుకొంటున్నానో ఆ స్థితికి మిమ్మల్ని తీసుకొని వెళ్ళటానికి, ఆ స్థితిని మీరు కోరుకోవ టానికే మీ చిల్లరికోరికలు నెరవేరుస్తున్నాను అని బాబా చెప్పారు. మనం ఈ ప్రకృతిని అతిక్రమించాలి, జన్మరాహిత్యస్థితిని పొందాలి, ఆత్మజ్ఞానాన్ని పొందాలి, అదే మన జీవితగమ్యం. అదే మన గమ్యం అయినప్పటికీ దానిమీద మీకు శ్రద్ధ కలగటానికి, ఈశ్వరుని యందు మీకు భక్తి కలగ జేయటం కోసం మీ కోరికలు నెరవేరుస్తున్నాను అన్నారు బాబా. శ్రద్ధ, సహనం వీటి రెండింటి గురించి బాబా జీవితం పొడుగునా చెప్పారు. సాధకులు వీటిని ఎప్పుడూ విడిచిపెట్టవద్దు అని చెప్పారు. ఏదైనా నాలుగు మాటలు చెప్పండి అని శారదామాతను ఎవరో అడిగితే సహనం, సహనం అనే ఒకే మాటను నాలుగుసార్లు చెప్పారు. సహనం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. కొంతమంది ప్రతీచిన్న విషయానికి రియాక్టు అయిపోతూ ఉంటారు, అంటే వారికి సహనం లేదు అని అర్థం. మన ఇంట్లోగాని, సమాజంలోగాని ప్రతీచిన్న విషయాని కి రియాక్టు అయ్యేవారు జీవితంలో ఏమీ సాధించలేరు. అంటే వారు ఇహానికి పనికిరారు, పరానికి పనికిరారు.

శ్రద్ధలేకపోతే మనం ఏమీ సాధించలేము. శ్రద్ధలేకపోతే మనం భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా సక్సెస్ అవ్వలేము. శ్రద్ధ, సహనం రెండూ మనకు రెండు నేత్రాల వంటివి. మీకు కుడికన్ను ఇష్టమా, ఎడమ కన్ను ఇష్టమా అంటే మాకు రెండు కళ్ళూ ఇష్టమే అని చెపుతారు. మాకు కుడికన్ను ఉంటే సరిపోతుంది, ఎడమ కన్ను అక్కరలేదు అని ఎవరూ చెప్పరు. అలాగే మనకు శ్రద్ధ, సహనం ఇవి రెండూ ఉంటేనే మనకు ఆధ్యాత్మిక పురోగతి, భౌతికంగా ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది. ఆరోగ్యమే గొప్ప సంతోషం, ఆరోగ్యానికి మించిన సంతోషం లేదు. నాకు వందకోట్లు డబ్బు ఉంది, నాకు అనారోగ్యంగా ఉన్నా ఇబ్బంది లేదు అని ఎవడూ అనుకోడు, వందకోట్లూ ఖర్చు పెట్టి ఆరోగ్యం తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. మనం శారీరకఆరోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఒకో శరీరం ఒకో పదార్థాన్ని రిజెక్టు చేస్తుంది, దానిని మనం విడిచిపెట్టాలి, మన శరీరమే మనకు గురువు. మనో దేహములకు అతీతంగా మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది, అది సుఖంగా ఉంది, శాంతిగా ఉంది, ఆనందంగా ఉంది. మనో దేహములను జాగ్రత్తగా ఉపయోగించుకొంటూ లోపలఉన్న సద్వస్తువును ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకున్నాడో వాడే నిర్వాణస్థితిని పొందుతాడు.

నాకు దేవుడు అక్కరలేదు అని చెప్పేవాడు ఉన్నాడుకాని నాకు సుఖం అక్కరలేదు అని చెప్పేవాడు ఎవడూ లేడు. ప్రతీవాడికి సుఖం కావాలి, శాంతికావాలి. ప్రతీవాడి హృదయంలో భగవంతుడు అంతర్యామిగా చైతన్యరూపంలో ఉన్నాడు. ఆ చైతన్యానికి సుఖం అనేది, శాంతి అనేది ఒక గుణం కాదు, దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే శాంతి. మీలో ఎవరైనా చెడ్డవారు ఉన్నా వారు మంచిస్నేహాలు చేస్తూ ఉంటే మంచివారుగా మారవచ్చు అంటే గుణాలు మారిపోతూ ఉంటాయి. సత్పురుషులతో సహవాసం చేసేవాడు సుఖపడతాడు, దుష్ట సాంగత్యంలో ఉన్నవాడు దుఃఖపడతాడు. చావుపుట్టుకలతోటి, రాగ ద్వేషములతోటి ఇసుమంతయు సంబంధం లేనిది చైతన్యం. కన్ను రూపాన్ని గ్రహించినట్లు, ముక్కు వాసనను గ్రహించినట్లు మన మనస్సుతో చైతన్యాన్ని గ్రహించలేము. అది ఉండటం వలననే అది మనకు తెలియబడుతూ ఉంటుంది. ఆస్థితిని మనం పొందేవరకు మనకు సుఖం లేదు, శాంతి లేదు. ఈ లోపుగా మనం ఏదైనా సుఖం అనుభవిస్తున్నాము అనుకొన్నా అది ప్రకృతికి సంబంధించినది, ఈ సుఖాలు అన్నీ కూడా దుఃఖంగా మారిపోతాయి. మనం

మంచి పనులు చేస్తే ఆఫలితం సుఖరూపంలో వస్తుంది, మనం చెడ్డపనులు చేస్తే ఆఫలితం దుఃఖరూపంలో వస్తుంది, ఇవన్నీ అనుభవిస్తే పోతాయి, ఇవన్నీ కూడా శరీరానికి, మనస్సుకు, తెలివికి సంబంధించినవి కొంతమంది దేహంతో, కొంతమంది మనస్సుతో, కొంతమంది తెలివితో తాదాత్మ్యం పొందుతూ ఉంటారు. ఈ దేహం కాని, మనస్సు కాని, తెలివి కాని ఇవి ఏమీ ఆత్మకాదు. ఆత్మకు వీటితో ఏమాత్రం సంబంధంలేదు. ఏదైతే ఆత్మకాదో వాటితో తాదాత్మ్యం పొంది పునర్జన్మలు తెచ్చుకుంటున్నాము, కర్మ అనుభవిస్తున్నాము, బరువులు మోస్తున్నాము. ఈ శరీరమూ, మనస్సు, తెలివి ఇవి ఏమీ ఆత్మను చూడలేవు, ఇవి అన్నీ ఆత్మచేత చూడబడతాయి.

బ్రహ్మజ్ఞానం పొందాలనుకొనేవారు బ్రహ్మం గురించి శ్రవణం చేయాలి. మనం నిప్పు దగ్గరకు వెళితే వేడి ఎలా తెలుస్తుందో అలాగ భగవంతుడిని స్మరిస్తూ ఉంటే ఆయన తాలూక వైభవం మనకు తెలుస్తుంది. ఆయనకు దూరంగా ఉంటే ఆయన వైభవం మనకు తెలియదు. మనం శారీరకంగా భగవంతుడికి దూరంగా ఉన్నా, మానసికంగా భగవంతుడితో అనుబంధం పెట్టుకోవాలి, అప్పుడు భగవంతుడు ఇట్టివాడు అని ఆయన వైభవం మనకు తెలుస్తుంది. నేను ప్రారబ్ధాన్ని అనుభవించలేకపోతున్నాను అని ఒక భక్తుడు ఆచార్యుల వారిని అడిగాడు. నిరంతరము నీవు భగవంతుడి సన్నిధిలో ఉంటే, భగవంతుడిని స్మరిస్తూ ఉంటే ప్రారబ్ధం నిన్ను ఏమి చేస్తుంది, ప్రారబ్ధాన్ని నీవు తేలికగా అనుభవించవచ్చు అని ఆచార్యుల వారు చెప్పారు. నీవు భగవంతుడిని చింతించటం మానివేసి, భగవంతుడి స్మరణ వదిలేసి విషయాలను చింతిస్తూ ఉంటే ప్రారబ్ధం నీకు బరువుగా ఉంటుంది కాని ఆత్మసుఖాన్ని నీవు పొందుతున్నప్పుడు ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాను అనే గొడవ కూడా నీకు ఉండదు అని చెప్పారు. గణపవరంలో చాలామంది ఉన్నారు. ఇప్పుడు నేను చెప్పనివ్వండి, వేరొకరు చెప్పనివ్వండి, అందరూ వచ్చి సబ్జక్టు వింటున్నారా? వినరు. ఎందుచేతనంటే ఆబుద్ధి విననివ్వదు. మీకు ఎప్పడూ అనుకరణ వద్దు, వారెవరో వినటం లేదు మనం మాత్రం ఇది వినటం ఎందుకు అని అనుకోవద్దు. ఎవరికయినా కేన్సర్ వచ్చింది అనుకోండి, మాకు కూడా కేన్సర్ వస్తే బాగుండును అని మీరు ఎవరైనా అనుకుంటారా? అనుకోరు. ఎవరో వినకపోతే వారి గొడవ మీకు ఎందుకు. పూర్వజన్మలో నిష్కామకర్మ చేస్తే, భగవంతుడిని ఆరాధిస్తే, భగవంతుడు సంతోషించే పనులు చేస్తే ఈ జన్మలో శ్రవణం చేయాలనే బుద్ధి కలుగుతుంది కాని మన

ఇష్టమా బ్రహ్మజ్ఞానం గురించి వినటానికి. ఒక మంచి విషయాన్ని స్మరిస్తే, మంచిని వింటే, మనకు మంచి ఆలోచన ఉంటే మంచి పని చేయాలనిపిస్తుంది కాని మంచి వినకుండా, మంచి ఆలోచన లేకుండా మంచి పనులు ఎలా చేస్తాము. బతికివుండి మంచిని చూడలేనివాడు వాడికి కళ్ళు ఉన్నా గుడ్డివాడితో సమానము, చెవులు ఉండి మంచిని వినని వాడు వాడికి చెవులు ఉన్నా చెవిటివాడితో సమానము అంటున్నారు ఆచార్యులవారు. పూర్వజన్మలో మనం పుణ్యకర్మలు చేసి ఉంటే ఇప్పుడు ఆత్మజ్ఞానం గురించి శ్రవణం చేయాలి అనే బుద్ధి కలుగుతుంది. మనం శ్రవణం చేసిన విషయాన్ని జాగ్రత్తగా మననం చేసుకోవాలి, దానిని ఆచరించటానికి ప్రయత్నం చేయాలి. మన హృదయంలో సత్యం ఉంది, దానిని ప్రాక్టీసు చేస్తూ ఉంటే అది మనకు అనుభవంలోనికి వస్తుంది.

ప్రతీ మానవుడికి పరాయి వాడు ఎవడూ శత్రువు కాదు, వాడి సోమరితనమే వాడికి శత్రువు. సోమరితనం ఉంటేవాడు ఈలోకానికి పనికిరాడు, పరలోకానికి పనికి రాడు. గురువు మన లోపల ఉండి గైడ్ చేస్తూ ఉంటాడు, మనలను ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో ఆయన చూసుకుంటూ ఉంటాడు, ఆయన మాట అనుగ్రహం, ఆయన చూపు అనుగ్రహం, అంతా అనుగ్రహమే అయితే ఆయన దయ లేకుండా ఆయన మాట యొక్క విలువ మనకు తెలియదు. మనలను అజ్ఞానంలో నుండి, అవిద్యలో నుండి, జననమరణ చక్రంలో నుండి బయటకు తీసుకొని వచ్చేవాడే భగవంతుడు, వాడు బాబా అవ్వవచ్చు, రమణమహర్షి అవ్వవచ్చు, రాముడు అవ్వవచ్చు, కృష్ణుడు అవ్వవచ్చు. మీ అమ్మ నాలుగు ముద్దలు అన్నం పెడుతుంది, డబ్బుంటే నాలుగు జతలు బట్టలు కొని ఇస్తుంది, ఇంకా ఎక్కువ డబ్బు ఉంటే పది ఎకరాల పొలం కొనిపెడుతుంది అంతే, మీ అమ్మ మిమ్మల్ని అజ్ఞానంలో నుండి బయటకు తీసుకొని వస్తుందా? తీసుకొని రాలేదు. ఒకవేళ మీ అమ్మ మిమ్మల్ని అజ్ఞానంలో నుండి బయటకు తీసుకొని రాగలిగితే మీ అమ్మ కూడా దైవంతో సమానం, అందులో సందేహం లేదు. మనకు దేహవాసన, లోకవాసన ఎక్కువగా వున్నాయి. యదార్థం చెప్పాలి అంటే మనం లేము, భగవంతుడు ఉన్నాడు. కాని మనం ఏమనుకొంటున్నాం అంటే మనం ఉన్నాము, ఆయన లేడు అనుకొంటున్నాము. ఆయన ఉన్నాడు అని ఒకవేళ మనం నోటితో చెప్పినా, లేడు అని మన బుద్ధి లోపలి నుండి చెపుతూ ఉంటుంది. ఇటువంటి మలినబుద్ధిని పెట్టుకొని నీకు దేవుడు కనిపించాలా? ఏమండీ దేవుడు ఉన్నాడా ఉంటే మాకు ఎందుకు

కనిపించటం లేదు అంటే ఇటువంటి మలినబుద్ధి ఉన్న నీకు దేవుడు ఎలా కనిపిస్తాడు. ఒక పెంకిమనిషి భగవాన్ దగ్గరకు వచ్చి మీరు నాకు దేవుడిని చూపించగలరా అని అడిగాడు. భగవాన్ మౌనంగా ఉన్నారు. వాడు ఇంకోసారి అడిగాడు. అప్పుడు భగవాన్ అన్నారు నేను భగవంతుడిని చూపిస్తాను నువ్వు భరించగలవా? భరించేశక్తి నీకు ఉందా? అన్నారు భగవాన్. వాడు కంగారుపడిపోయాడు, ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి. ఇంత కంగారు పడిపోయే నీకు భగవంతుడు కావాలా? భగవంతుడు అంతటా ఉన్నాడు, నీలో అంతర్యామిగా కూడా ఉన్నాడు.

జ్ఞానికి దేహం ఉంటుంది, అజ్ఞానికి దేహం ఉంటుంది. ఇద్దరికీ చాలా తేడా ఉంది. అజ్ఞాని ఏమనుకొంటాడు అంటే నేను దేహాన్ని అనుకొంటాడు కాని జ్ఞాని ఏమనుకొంటాడు అంటే నాకు ఒక దేహం ఉంది అనుకొంటాడు. ఆ దేహం ఉండవచ్చు, పోవచ్చు, వాడి అది కాదు కదా. దేహం ఉండటం వలన వాడికి లాభం లేదు, దేహం పోవటంవలన వాడికి నష్టం లేదు ఎందుచేతనంటే దేహం ఉన్నా వాడు ఉంటాడు, దేహం పోయినా వాడు వుంటాడు. ఈ నామరూపాలతో సంబంధం లేకుండా వాడు అఖండముగా ఉంటాడు. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన ఈ శరీరాన్ని ఖాళీ చేసాడు అనుకోండి, దీనికి ఏమీ విలువ లేదు. చనిపోయిన కోడిని డబ్బుపెట్టి కొంటారు కాని చనిపోయిన మనిషిని ఇంట్లో కొంతసేపు ఉంచుతాము అంటే ఎవరూ ఒప్పకోరు వాడికి వందకోట్లు డబ్బు ఉన్నా ప్రాణంపోతే ఆశరీరానికి విలువలేదు. ఈ లోకానికి సంబంధించిన నామాలు, రూపాలు, గౌరవాలు, అగౌరవాలు, జయాలు, అపజయాలు వీటి గొడవలో పడిపోయి, ఈ దుమ్ములో పడిపోయి అసలు వస్తువును వదిలివేసాము, ఉన్న దానిని లేదు అనుకొంటున్నాము, లేనిది ఉంది అనుకొంటున్నాము ఈ తిరకాసు గొడవల నుండి మనలను విడదీయటం ఒక్క గురువుకు తప్పించి ఎవరికీ సాధ్యం కాదు. ఏ వస్తువునయితే పొందాలి అనుకొంటున్నామో దాని తాలూక దయ లేకుండా దానిని మనం పొందలేము. అందుచేత మన ప్రవర్తన ఎలా ఉండాలి అంటే ఆ వస్తువు యొక్క దయను పొందటానికి అనుగుణంగా మన ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి. సాధన అంటే ఏమీ లేదు లోపల మనం ఏదిగా ఉన్నామో దాని తాలూక అనుభవం పొందటానికి ఏ బలహీనతలు అయితే మనకు అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించుకోవటానికి మనం చేస్తున్న ప్రయత్నమే సాధన. కిరసనాయిలు డబ్బా ఉంది

అనుకోండి, దానిని నాలుగు సార్లు కడుగుతాము కానీ ఆ వాసన పోదు, రెండు రోజులు ఎండలో పెడితే వాసన పోతుంది. అలా మన మనస్సును ఎండింపచేయాలి. ఈశ్వరుడు గుణాతీతుడు. మనకు మంచిగుణాలు ఎందుకు అంటే మంచిగుణాలతో భగవంతుడిని ఆరాధించి గుణాతీతస్థితిని పొందటం కోసం. నేను మంచివాడిని, నేను మంచివాడిని అనుకొంటూ కూర్చోకూడదు. ఆ మంచిగుణాలను ఉపయోగించుకొంటూ మనస్సును అతిక్రమించాలి. మీకు ఏదైనా కలిసివస్తే సంతోషం వస్తుంది, అది ఒక ఉద్రేకం. మీకు ఏదైనా నష్టం వస్తే దుఃఖం వస్తుంది, అది ఒక ఉద్రేకం. అలాగే నీకు చావు వస్తోంది అంటే నీకు భయం కలుగుతుంది, అది కూడా ఒక ఉద్రేకం. నీవు నీవుగా లేకపోవటం వలన వచ్చే ఉపద్రవాలు ఇవి అన్నీ. నువ్వు అసత్యాన్ని సత్యం అనుకోవచ్చు, నువ్వు అనుకోవటం వలన అసత్యం సత్యం అవ్వదు.

ఒక మంచి పనిని అసలు చెయ్యకుండా ఉండటం కంటే ఆలస్యంగా అయినా చెయ్యటం మంచిదే. మీకు వయస్సులో ఉండగా జ్ఞానం కలిగితే పరవాలేదు, వయస్సులో కలుగలేదు అనుకోండి, ఇంక ఇప్పుడు దానికోసం ప్రయత్నం ఎందుకు? ఇప్పుడు 90 సంవత్సరాలు వచ్చేసాయి అని అనుకోవద్దు, మీకు 90 సంవత్సరాలు వచ్చినా కూడా ప్రయత్నం ప్రారంభించండి. మీకు 90 సంవత్సరాలు వచ్చాయి అని అన్నం తినటం మానివేస్తు న్నారా? జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం మానివేస్తున్నారా? ఏదీ మానటం లేదు. ఇంక దైవంకోసం, జ్ఞానంకోసం ప్రయత్నం చేయటం మానటం ఎందుకు? అన్ని పనులు చేసుకొంటూ దైవస్మరణ ఒక్కటి మానివేస్తారా? వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని మనం అనుకొంటూ ఉంటాము, ఇటువంటి గొడవలు వద్దు, నీవు సైలెంట్‌గా ఉండటానికి ప్రయత్నం చెయ్యి అని ఆచార్యులవారు చెప్పారు. వాడి అహంకారం ఏదో అంది దాని వలన నీకు వచ్చే నష్టం ఏమిటి? నువ్వు గొప్పవాడివి అని వాడు అంటే నీవు గొప్పవాడివి అయిపోవు, నువ్వు ఎందుకు పనికిరానివాడివి అని అంటే పనికిరానివాడవు అయిపోవు. నీకూ భగవంతుడికి సంబంధం కాని, వాడికి నీకూ అసలు సంబంధం ఏమిటి? వాడి అహంకారం ఏదో అందని నీ మనస్సును పాడుచేసుకుంటున్నావు. నువ్వు సైలెంట్‌గా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. ప్రకృతి యొక్క ప్రభావం, ఆ మాటల యొక్క ప్రభావం నీ మెదడు మీద పడకుండా చూసుకో. శంకరాచార్యులవారు ఏమి చెప్పారు అంటే మీరు అందరూ నిజంగా చనిపోతే

నాకు సంతోషమే కాని మీరు నిజంగా చనిపోవటం లేదు. మేము భీమవరం వెళ్ళి వస్తాము అని చెప్పి ఒక గంటలో మరల ఇంటికి తిరిగివచ్చేస్తారు అలాగే మీరు ఇవాళ చనిపోతున్నారు, రేపు పుడుతున్నారు. ఎవడైతే తిరిగిపుట్టాడో వాడు నిజంగా చనిపోయినట్లు. దేహం యొక్క మరణం మరణం కాదు, దేహంతో ఏతలంపు అయితే తాదాత్మ్యం పొందుతోందో దానిలో నుండి విడుదలపొందటమే నిజమైన మరణం, అదే మోక్షం. ఒక్క బ్రహ్మం తప్పించి అన్నీ తలంపులే. మనస్సు ఉంటే నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, లోకం ఉంది, దేవుడు ఉన్నాడు, అదిపోతే ఏమీలేదు. దేహం లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, దేవుడు ఎక్కడో ఉన్నాడు అని నీకు అనిపిస్తోంది. ఇది అంతా అనిపింప జేసేది మనస్సే. మనస్సు నశిస్తే అది కల్పించినవి అన్నీ కూడా నశిస్తాయి.

నువ్వు అమనస్కస్థితిని పొందాలి, నీ మనస్సు ఎంత నిజమో రాబోయే జన్మలు కూడా అంతే నిజం, నీ మనస్సు ఎంత నిజమో వైకుంఠంలో ఉన్న దేవుడు కూడా అంతే నిజం, నీ మనస్సు ఎంత నిజమో ఈ పుణ్యాలు, పాపాలు కూడా అంతే నిజం, ఇవన్నీ వ్యవహారిక సత్యములే. అసలు సత్యానికి, దీనికి ఏమీ సంబంధం లేదు. ఒకటా, రెండా అని ఒకరు భగవాన్‌ను ప్రశ్నించారు. ఎప్పుడు అన్నారు భగవాన్. ఇప్పుడే అన్నాడు. ఇప్పుడు అయితే రెండే అన్నారు. తెలుసుకొంటే ఒక్కటే, తెలియకపోతే రెండు. ఏ మనిషీ తనను తాను చూసి భయపడడు, ఇతరులను చూసి భయపడతాడు. ఇద్దరు ఉంటే భయం, ఇద్దరు ఉంటే ఇష్టం, అయిష్టం, రెండులో నుండే ఘర్షణ ప్రారంభమవుతుంది. ఉన్నది ఒక్కటే అయితే ఏమీ లేదు. విషం కంటే ప్రమాదమైనది, విషపూరితమైనది ఏమైనా ఉందా అని ఆచార్యులవారిని అడిగారు. ఉంది అని ఆచార్యులవారు చెప్పారు. విషం కంటే విషపూరిత మైన మనిషి చాలా ప్రమాదం. కొంతమందికి శరీరం అంతా, మనస్సు అంతా విషమే. వారు బాగుపడరు, ఇతరులను బాగుపడనివ్వరు. ఎదుటిమనిషిలో 99 మంచిగుణాలు ఉన్నాయి అనుకోండి, ఏదైనా ఒక్క చెడ్డగుణం ఉంది అనుకోండి. 99 మంచిగుణాలు వదిలేసి ఆ చెడ్డగుణం చెపుతూ ఉంటారు, వారు విషం కంటే ప్రమాదం. నీకు ప్రపంచంలో ఎక్కడయినా చెడ్డ కనిపిస్తూ ఉంటే అది నీ మనస్సులో ఉంది. నీ మనస్సులో లేనిది బయట కనిపించదు. ఎవడైనా చెడ్డవాడు నీకు కనిపిస్తూ ఉంటే హృదయంలో వాడు నీవు ఒక్కటే, గాఢనిద్రలో వాడు నీవు ఒక్కటే. కాని మెలకువ వచ్చాక మనస్సు వస్తోంది, మనస్సు వచ్చాక

గుణం వస్తోంది, దానినిబట్టి చెడ్డవాడు, మంచివాడు అంటున్నావు, అక్కడనుండి ద్వైతం ప్రారంభమవుతుంది. వాడిలో కూడా మనం ఉన్నాము అన్న సంగతి నీకు అర్థమయితే ఏమీ లేదు, అక్కడ నీకు రియాక్షన్ ఉండదు. ప్రపంచం అంతా మనం ఉన్నప్పుడు వాడిలో లేకుండా ఎలా ఉంటాము. ఒక మనిషి నీకు చెడ్డవాడుగా కనిపిస్తున్నాడు అనుకో, నువ్వు కళ్ళు మూసేసుకుంటే వాడిలో ఉన్న చెడ్డతనం ఎక్కడికి పోతుంది, ఆ చెడ్డతనాన్ని చూస్తూ నీవు దానిని అతిక్రమించాలి. అప్పుడు నీవు సాధకుడవు. నీకు విషయం ఏమిటో అక్కడ తెలుస్తూ ఉండాలి, తెలుస్తున్నప్పటికీ అందులో నీవు కలిసిపోకూడదు, చెడ్డను చూస్తున్నప్పటికీ దానిని గ్రహించనంత ఎత్తుకు నీవు ఎదగాలి, అది సాధన యొక్క గమ్యం. ప్రాణాయామం చెయ్యి, మనస్సును నిగ్రహించుకో, అధ్యయనం చెయ్యి, ధర్మాన్ని ఆచరించు. నువ్వు ధనాన్ని సంపాదించుకో, అది ధర్మబద్ధంగా ఉండాలి, ధర్మానికి విరుద్ధంగా ధనాన్ని సంపాదించవద్దు. నువ్వు చదువుకో, రీజనింగ్‌ను విడిచిపెట్టవద్దు, రీజనింగ్ ఎంతవరకు సహకరిస్తే అంత వరకు దానిని ఉపయోగించుకో. రీజనింగ్‌కు అతీతంగా ఏదైనా ఉంది అనుకో దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. భగవంతుడు నీ రీజనింగ్‌కు దొరకడు, అప్పుడు అనుభవం మీద ఆధారపడు, శాస్త్రం మీద ఆధారపడాలి. నిమ్మకాయ పుల్లగా ఉండును, చెరుకురసం తియ్యగా ఉండును అని తెలుసుకోవటానికి గీత చదవటం ఎందుకు, నోట్లో పెట్టుకుంటే నీకే తెలుస్తుంది కదా! నీకు తెలియని విషయాలు తెలుసుకోవటానికే గీత. నీవు ఏమి చేయాలి అంటే దైనందినజీవితంలో నీ బిహేవియర్‌ను చక్కగా తీర్చిదిద్దుకొని, ఆధ్యాత్మికంగా అభివృద్ధిని పొందటానికి ప్రయత్నం చెయ్యాలి. మనం పొందవలసింది వేరే ఉంది, దానిని పొందటానికి మన కళ్ళకు కనిపించే దానిని ఉపయోగించుకో.

ప్రపంచం అంటే ఏముంది రూపం, నామం, క్రియ ఇదే ప్రపంచం, అంతకంటే ఏమీ లేదు. మోహం విడిచిపెట్టకుండా, దేహభావనను విడిచిపెట్టకుండా ఎవడికీ మోక్షం రాదు. మనందరకు చావు అంటే భయం కలుగుతోంది. ఎందుకు భయం అంటే శరీరం చనిపోయాక మనం ఉండము అనుకొంటున్నాము. శరీరమే కనుక మనం అయితే శరీరం చనిపోయాక మనం ఉండము, శరీరం మనం కాదు కదా అందుచేత శరీరం చనిపోయాక కూడా మనం ఉంటాము. మన జీవితం అంతా కూడా కృత్రిమం. మనం ఎంత సిల్లీగా ఉంటాము అంటే ఒంటరిగా ఉన్నప్పడు ఎక్కువగా తినేస్తాము, పదిమందిలో ఉన్నప్పడు తక్కువ

తింటాము. మనం లోపల ఒకరకంగా ఉంటాము, బయట ఒకరకంగా ఉంటాము. మన ఆలోచన ఒక రకంగా ఉంటుంది, మాట ఒకరకంగా ఉంటుంది, చేత ఒకరకంగా ఉంటుంది అంటే మనకు త్రికరణశుద్ధి లేదు. ఆ మూడింటికీ సమన్వయం లేనప్పుడు, నిదానం లేనప్పుడు, ఇవి మూడూ ఏకంగా లేనప్పుడు ఏకవస్తువు నీకు ఎలా లభ్యమవుతుంది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, అదే మనకు అనేకంగా కనిపిస్తోంది, ఈ అనేకంలో మనం దానిని చూడగలిగి నప్పుడు మనకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. ఇప్పుడు మనం ఎవరినైనా ద్వేషిస్తున్నాము అనుకోండి మనల్ని మనమే ద్వేషించుకొంటున్నాము. ఎవరి కయినా సహాయం చేస్తున్నాము అనుకోండి మనకు మనమే సహాయం చేసుకొంటున్నాము. ఉన్నది ఒక్కటే. నువ్వు ఏ రూపంలో ఏది చేసినా అది నీకే తిరిగి వచ్చేస్తుంది. అది నీకు అర్థమయితే ఇతరులకు సహాయం చేయకుండా ఎలా ఉండగలవు. ఏమండీ వారు బాగా సుఖపడుతున్నారు, మేము సుఖపడటంలేదు కష్టాలు పడుతున్నాము ఏమిటి అని ఆచార్యుల వారిని అడిగారు. ఆయన ఏమి చెప్పారు అంటే పూర్వజన్మలోవారు చేసిన సత్‌కర్మకు ఫలితంగా భగవంతుడు వారికి ఆసుఖాన్ని ఇచ్చాడు అని చెప్పారు. భగవంతుడు నీకు విరోధి కాదు, వారికి స్నేహితుడు కాదు. మనం చేసినదే మనకు ఇస్తూ ఉంటాడు. కొంతమంది 100 సంవత్సరాలు జీవించినా వారి వివాహజీవితం చాలా సంతోషంగా వెళ్లిపోతుంది, కొంత మందికి పెళ్లి అయిన మరుసటి రోజు నుండే పేచీలు ప్రారంభమవుతాయి, దానికి దీనికి జన్మాంతరంలో ఏదో సంబంధం ఉంటుంది, అది మన కళ్లకు కనబడదు. నీకు జ్వరం వస్తోంది అనుకో ఒకోసారి డాక్టరు టెస్టులు చేయిస్తాడు. ఎందుకు వస్తోందో ఆ కారణం మన కళ్లకు కనబడదు అంటేకారణం లేదు అనికాదు. ఏ కారణం లేకపోతే జ్వరం ఎందుకు వస్తుంది. ఆ కారణం తెలుసుకోవటానికే డాక్టరు పరీక్షలు చేస్తాడు. సంతోషం, దుఃఖం, చావు, పుట్టుక, జయం, అపజయం ఇవి అన్నీ మన మనస్సుకు సంబంధించిన విషయాలు. ఈ ఎల్‌కెజి గొడవలు అన్నీ తీసి ఒకప్రక్కన పెట్టు. నువ్వు ఎవడివో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఈ చిల్లరగొడవలకు నీ టైమును వృధాచేసుకోవద్దు. నేను పేదవాడిని అని అనుకోవద్దు, నేను ధనవంతుడిని అని అనుకోవద్దు, నేను పామరుడిని అని అనుకోవద్దు, నేను పండితుడిని అని అనుకోవద్దు. మన లోపల ఉన్న సద్వస్తువు మనం అనుకొన్నట్లుగా అది లేదు, అది ఎలా ఉండాలో అలా ఉంది, అది మనం అర్థం చేసుకోవాలి. మనం

అనుకొన్నట్లుగా అది లేదు అందుచేత దాని విలువ మనకు తెలియటం లేదు. అది మనో దేహములకు అతీతం, మన లాజిక్కులకు అతీతం.

భౌతికమైన సుఖాలు మనకు రోగాలను తీసుకొని వస్తాయి. భగవంతుడిని స్మరించుకోవటం వలన వచ్చే సుఖం అది రోగాన్ని తీసుకొని రాదు, ఆనందాన్ని తీసుకొని వస్తుంది. ప్రతీ మానవుడు కూడా తనను తాను ఎక్కువగా ప్రేమించుకొంటాడు. మీ ఆయనకంటే కూడా మీరంటేనే మీకు ఎక్కువ ఇష్టం. మీ ఆయన మీకు అనుకూలంగా ఉంటే ఇష్టపడతారు, ఎప్పుడయినా వ్యతిరేకం గా ఉంటే ఇష్టాన్ని వదిలేస్తారు అది లోకసహజం. వాడంటే వాడికి ఎందుకు ఇష్టం అంటే వాడు సుఖస్వరూపుడు, శాంతిస్వరూపుడు. వాడి సుఖానికి ఎవడయినా ఉపయోగపడుతూ ఉంటే వాడిని ప్రేమిస్తాడు లేకపోతే ప్రేమించలేడు. మీ ఇంట్లోనివారు అయినా అంతే, అక్కడ మీరు ముఖ్యం కాని మీకు మీ ఇంట్లో ఉన్న మనుషులు ముఖ్యం కాదు. వారందరినీ ప్రేమిస్తున్నాను అని మీకు ఊరికే అనిపిస్తుంది కాని అదినిజం కాదు. కోరికవేరు, ప్రేమవేరు. కోరిక ఏదో ఒకటి అడుగుతుంది, ప్రేమ అడగదు. కోరికకు గుర్తింపు కావాలి, ప్రేమకు గుర్తింపు అక్కరలేదు. ప్రేమ తగ్గుతూ ఉంటే కోరికలు పెరుగుతాయి, ద్వేషం పెరుగుతుంది. సంతోషం తగ్గుతూ ఉంటే దుఃఖం పెరుగుతూ ఉంటుంది. మోక్షం అంటే ఏమీ లేదు మన నిజమైన ఇంటికి మనం చేరుకోవటమే మోక్షం, మనం ఎక్కడనుండి అయితే బయలుదేరి వెళ్ళామో తిరిగి అక్కడకు చేరుకోవటమే మోక్షం. మీ అందరి హృదయాల లో నేను ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఆయన ఏ హృదయంలో అయితే నివాసమున్నాడో అక్కడకు చేరుకోవటమే మోక్షం. మనం ఎక్కడికయినా పెళ్ళికి వెళ్ళాము అనుకోండి, అక్కడ అనేకమందితో మాట్లాడతాము, అనేకరకాల పదార్థాలు తింటాము. చివరకు ఇంటికి చేరుకున్నాక అమ్మయ్య మన ఇంటికి వచ్చేసాము అనుకొంటాము. ఇప్పుడు మనం మన ఇంటికి దూరమయిపోయాము, తిరిగి మన ఇంటికి చేరుకోవాలి. నువ్వు ఎంతదూరం అయితే వెళ్ళిపోయావో అంతదూరం మరల వెనక్కి రావాలి. అప్పుడు కాని నీ ఇంటికి నువ్వు రాలేవు. నీ ఇంటికి నీవు చేరుకోవటానికి నీ దేహాన్ని, మనస్సును, ఇంద్రియాలను మేగ్జిమమ్ ఉపయోగించుకో. వాటిని ఉపయోగించుకొంటూ నీవు పొందవలసింది పొందాలి. ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికి మించిన సుఖంగాని, దానితో సమానమైన సుఖంగాని లేదని మనకు తెలుస్తుందో అట్టి సుఖాన్ని పొందు, అది నీ

హృదయంలోనే ఉంది. నీ హృదయంలో ఉండటమేకాదు అది నీవై ఉన్నావు.

చలంగారు భగవాన్‌ను ఉద్దేశించి ఒక పద్యం వ్రాసారు. నీవు రావు, నన్ను పోనీవు, మరల్చి మత్తెక్కించి, స్వప్నాలలో లాలించి, మధురగానాలతో ఊరించి ప్రపంచానికి వ్యర్థుడ్నిగా చేసావు భగవాన్ అన్నారు. నీ స్వరూపాన్ని నాకు ఇవ్వవు, పోనీ నా తిప్పలు ఏవో నేను పడతాను అంటే నన్ను బయటకు పోనివ్వవు. తలుపు సందున పెట్టి నలిపేస్తున్నావు ఎందుకు? వాసనలను క్షయం చేయటానికి. ఈ వాసలను నా తెలివితేటల వలన బయటకు తీసుకోలేను. ఇవి పెద్ద పెద్ద బండరాళ్ళు, ఈ వాసనలు ఎన్ని వేల జన్మలనుండి వస్తున్నాయో. ఈశ్వరుడి అనుగ్రహం లేకుండా ఒక సిగరెట్ కాల్చే అలవాటులోనుండి కూడా బయటకు రాలేము. స్వప్నాలలో దర్శనమిస్తావు, బాబూ ఎలా ఉన్నావని అడుగుతావు, ముద్దు పెట్టుకొంటావు. సారా తాగేవాడికి ఎంత మత్తు వస్తుందో భగవంతుడిని స్మరించుకోవటం వలన భక్తుడికి కూడా అంత మత్తు వస్తుంది అని చలంగారు అన్నారు. ఏదో లోకం గొడవలు మర్చిపోవటానికి సారా తాగుతున్నాము అని కొంతమంది చెపుతూ ఉంటారు. లోకం విషయాలు మర్చిపోవ టానికి మీరుసారా తాగనక్కరలేదు, భగవంతుడిని స్మరించుకోండి మీకు మత్తు వచ్చేస్తుంది. భగవంతుడిని స్మరించుకోవటం వలన మీ శరీరానికి ఆరోగ్యం వస్తుంది, మనస్సుకు శాంతి కలుగుతుంది. మీరు ఐశ్వర్యవంతులు అవుతారు. మనోనిగ్రహం కలుగుతుంది. మీకు మత్తు కావాలంటే మత్తు కూడా వస్తుంది. సారా కొనుక్కోవాలంటే డబ్బు ఖర్చు అవుతుంది. స్మరణకు ఖర్చు ఏముంది? జపం చేసుకోవటానికి ఒక్కపైసా కూడా ఖర్చు అవ్వదు.

మన గురువు మనలను వదిలేసాడు, మనం గురువుకు దూరమయిపోయాము అని మనకు అప్పుడప్పుడు అనిపిస్తుంది. నువ్వు నిజంగా దూరమవ్వవు, దూరమయినట్లు నీ మనస్సుకు అనిపింపజేస్తాడు, ఎందుకు? తడిగుడ్డను పిండితే నీళ్ళు ఎలా కారతాయో అలా మనస్సును పిండటానికి దూరమయినట్లు కనిపిస్తాడు. నాలోని వాసనలను పిండటానికి అలా నటిస్తు న్నావు. బట్టలను రాతికి ఎందుకు కొడతారు? దానిలో ఉన్న మురికిని పోగొట్టటానికి అలా కొడతారు. అలాగే మన గురువు మనకు దూరమయినట్లు నటించి, దూరమయినట్లు మన మనస్సుకు అనిపింపచేసి కొన్ని వాసనలను పిండేస్తాడు. ఒకోసారి ఏమి చెస్తాడు అంటే ఎదుటివారి హృదయాలలో ప్రవేశించి వారిచేత మనలను తిట్టిస్తాడు. అంటే ఆ తిట్లను భరించేశక్తి మనకు ఎంతఉందో చూడటానికి ఇలా చేస్తూ ఉంటాడు.

అంటే ఆ తిట్టేవాడిలో కూడా నేను ఉన్నాను అనే అనుభవం నీకు కలుగజేయటం కోసం అలా తిట్టిస్తాడు నన్ను ఎడ్యుకేట్ చేయటానికే ఇవి అన్నీ చేస్తున్నావు. ఒకోసారి సడన్‌గా హృదయంలోనికి తీసుకొంటావు, ఆనందంలో ఊగిస్తావు. ఎంత సుఖంగా ఉంది, ఎంత ఆనందంగా ఉంది అని అనిపిస్తుంది మరల మాయలో పడవేస్తావు. ఈ దోబూచులాట ఎంతకాలం? ఇవి అన్నీ ఎందుకు చేస్తున్నావు అంటే వాసనలు పూర్తిగా పిండేసి, వాసనా క్షయం పూర్తి అయితేనే గాని మనకు ఆనందం వచ్చినా అది నిలబడదు. టెంపరరీగా వచ్చే ఆనందాన్ని పెర్మనెంట్ చేయటానికే ఈ దోబూచులాట. ఒకోసారి ప్రేమగా మాట్లాడతావు, ఒకోసారి నీకు నాకు సంబంధం ఏమిటి? అంటావు. నిన్ను చూడటానికి ప్రేమగా వస్తే నీ మొఖం ఒక ప్రక్కకు తిప్పకొంటావు. అప్పడు మనకు కోపం వచ్చేస్తుంది. మనలో ఎంత కోపం ఉందో మనకు చూపించటానికి నీ మొఖం అలా ప్రక్కకు తిప్పకొంటున్నావు. ఇవన్నీ కూడా వాసనా క్షయం చేయటానికి చేస్తున్నావు, రమణా. ఇప్పడు ఈ స్థంబానికి ఎవడయినా మనలను సంకెళ్ళు వేసి కట్టాడు అనుకోండి, ఆ సంకెళ్ళు మనం తెంపేసుకొని పారిపోవచ్చు. నీకూ నాకూ సంకెళ్ళలాంటి బంధం ఇది, ఈ సంకెళ్ళు తెంపుకొందామంటే కళ్ళకు కనబడటం లేదు, అలాగని సంకెళ్ళు లేవా అంటే ఉన్నాయి, పరిస్థితి ఇలా పెట్టావు. ఇదంతా ఎందుకు చేస్తున్నావు అంటే నాలో ఉన్న అజ్ఞానాన్ని బయటకు లాగి తగులబెట్టి నీ స్వరూపాన్ని నాకు ఇవ్వటానికే ఇది అంతా చేస్తున్నావు అని నేను గ్రహిస్తే ధన్యుడిని లేకపోతే నేను పిశాచాన్ని. అంటే గురువు యొక్క కోపం కూడా గురువు యొక్క దయే అని గ్రహించినవాడు ధన్యుడు. నీ దగ్గరకు రాకముందు అనుకొనేవాడిని ఈ లోకంలో చాలా గొప్ప సంపాదించాలి అని, నీ దగ్గరకు వచ్చాక ఇది అంతా నిస్సారత అని తెలిసింది. నేను ఏవయితే గొప్పలు గొప్పలు అనుకొన్నానో అందులో ఏమీ లేదు అని, అందులో ఉన్న నిస్సారతను నా బుద్ధి గ్రహించేటట్లు చేసావు. ఇదంతా నీవే చేస్తున్నావు కాని నీవు చేస్తున్నట్లు కనబడవు ఎందుచేతనంటే నీకు గుర్తింపులు అక్కరలేదు. మీ అమ్మాయికి మీరు ఏదైనా సహాయం చేసారు అనుకోండి, ఏదో ఉద్ధరిం చేస్తున్నాము అని మీరు అనుకోరు. గురువు కూడా అంతే. మనకు ఏదైనా ఉపకారం చేసినా ఉపకారం చేసాను అని ఆయన అనుకోడు. ఒకవేళ తల్లి ఎప్పడైనా కూతురును ఆక్షేపించవచ్చు ఎందుచేతనంటే అక్కడ ద్వైతం ఉంది కాబట్టి. భగవంతుడికి ద్వైతం లేదు.

ఒకసారి గాంధీగారు భార్యకు ఉత్తరం వ్రాస్తూ ఇప్పుడు మనం ఉన్నాము అనుకొంటున్నాము, చనిపోయిన తరువాత ఉండము అనుకొంటున్నాము, చనిపోయిన తరువాత కూడా ఉంటాము. జీవితానికి, చావుకి మధ్యన బేధం ఏమీ లేదు. ఆ బేధం లేనిస్థితిని పొందటమే ఆత్మజ్ఞానం, అప్పడే మోక్షం వస్తుంది. ఆస్థితి ఇప్పడుఉంది, దానిని నువ్వు ఇప్పడే ఇక్కడే పొందాలి అని వ్రాసారు. ఆ స్థితిని పొందినప్పడు శరీరం చనిపోయినా నేను ఉంటున్నాను అన్న సంగతి నీకు తెలుస్తుంది. అడిగితేనే గాని అమ్మ అయినా అన్నం పెట్టదు అంటారు. కాని నీవు అడగకుండానే నాకు అమృతానుభవం ఇచ్చావు, మరణానుభవం ద్వారా మరణం లేని స్థితిని ప్రసాదించావు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. దీనికి కారణం లేదు, నా చేత అడిగించుకోలేదు, నాకు నొప్పిలేకుండా అమృతానుభవం కలుగజేసావు. చిన్నపిల్లలు అన్నం తినకపోతే చందమామను చూడు, చందమామను చూడు అని ముద్దను నోట్లో పెట్టేస్తారు. అలాగే చావు భయం చూపించి, చావు భయం చూపించి చావులేని స్థితికి తీసుకొని పోయావు. సాధన పేరు మీద ఏమీ బాధ లేకుండా సాధన ద్వారా ఏది పొందాలో దానిని పొందింపచేసావు అరుణాచలేశ్వరుడా. నీ దయ ఇట్టిది అని ఎలా చెప్పగలను అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. అదృష్టం, దురదృష్టం అహంకారానికే, లాభ నష్టాలు అహంకారానికే, చావు పుట్టుకలు అహంకారానికే, ఇంట్లో గొడవలు అన్నీ అహంకారానికే. అది నువ్వు కాదు. సాధన ఎందుకు అంటే ఏది రావటం వలన అన్నీ వస్తున్నాయో దానిని అతిక్రమించటానికే సాధన, అది నువ్వు కాదు అని తెలుసుకోవటానికే సాధన. ఇప్పడు ఎవరైనా దుఃఖపడుతూ ఉంటే భవిష్యత్‌లో ఒకరోజు వస్తుంది, అనవసరంగా దుఃఖపడ్డాము, ఏమీ లేనిదానికి దుఃఖ పడ్డాము, ఏదో కల్పించుకొని దుఃఖపడ్డాము అని మీరు అనుకొనే రోజు ఒకటి వస్తుంది అంటున్నారు భగవాన్. ఏమీ లేనిదానికి దుఃఖపడ్డాము, చాలా బాధపడ్డాము అని భవిష్యత్‌లో మీకు సత్యజ్ఞానం కలిగాక అనిపిస్తుంది. కుట్ర అంతయు గోసి గుణముగా పాలించు గురు రూపమై వెలుగు అరుణాచలా! నిన్ను పొందటానికి ఏ బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో ఆ బలహీనతలను కాల్చి బూడిద చేసి నీ స్వరూపాన్ని నాకు ఇయ్యి అరుణాచలా! ఈ బేరంలో నాకు లాభం వస్తోంది, నీకు నష్టం వస్తోంది. నా దగ్గర ఉన్న దుఃఖాన్ని తీసుకుంటున్నావు, నాకు ఆనందాన్ని ఇస్తున్నావు. ఎందుకు పనికిరాని అహంకారాన్ని తీసుకొంటున్నావు, నాకు బ్రహ్మజ్ఞానాన్ని ఇస్తున్నావు అంటున్నారు భగవాన్.

# ఏది అసలయిన జ్ఞానం

- బొప్పన అరుణాదేవి, హైదరాబాద్

" జ్ఞానం కర్మచ కార్తచ
త్రిధైవ గుణభేదతః
ప్రోచ్యతే గుణసంఖ్యానే
యధావచ్ఛణు తాన్యపి ॥"

భగవద్గీత యందు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన విధంగా జ్ఞానం మూడు విధములుగా ఉన్నది. అవి సాత్త్విక జ్ఞానము. రాజసజ్ఞానము మరియు తామసజ్ఞానము. వేదాంతపరంగా అది సరిఅయినది. సాంఘిక, సామాజిక పరంగా ఆలోచించినప్పుడు జ్ఞానం విషయజ్ఞానం, శాస్త్రజ్ఞానం, అనుభవజ్ఞానం అని మూడు విధములుగా చెప్పవలసి వస్తున్నది.

ఈ సమాజంలో ఎందరో మేధావులున్నారు. ఉదాహరణకి ఒక డాక్టరు, ఇంజనీరు, సైంటిస్టు, లెక్చరరు, ప్రొఫెసరు ... ఇలా వీరందరిని మేధావులు జ్ఞానులు అనవచ్చును. వీరి వలన సమాజానికి ఎంతో మేలు జరుగుతున్నది. వీరి కున్న మేధాశక్తితో ఎందరినో ప్రభావితు లను చేస్తూ ఉంటారు. సమాజం ప్రగతిపథంలో అత్యున్నత స్థితిలో ప్రయాణించేలా శ్రమిస్తూ ఉంటారు. వీరిది విషయజ్ఞానం, అంటే కేవలం ఒక విషయానికి మాత్రమే సంభందించిన జ్ఞానం అది పరిమితం. ఒక డాక్టరుకి రోగులకు వైద్యం చేయగల సామర్థ్యం, ఉంటుంది తప్ప దేశరక్షణకి సంభందించిన జ్ఞానం ఉండదు. అలానే ఒక ఇంజనీరుకు కట్టడాల గురించిన జ్ఞానం ఉంటుంది తప్ప అంతర్జాతీయ వాణిజ్యం గురించిన అవగాహన ఉండకపోవచ్చు. అంటే వీరికుండే అవగాహన మేధ ఏదో ఒక విషయానికి మాత్రమే పరిమితమయి ఉంటుంది. కాబట్టి వీరి జ్ఞానం అసంపూర్ణమని చెప్పబడుతున్నది.

మరి కొందరు వేదాలను, వేదాంతాలను, ఉపనిషత్తులు, ఆగమ శాస్త్రములను అధ్యయనం చేస్తూ ఉంటారు. ఆయా శాస్త్రవిషయాలలో అద్భుతమయిన పాండిత్యాన్ని పొంది గొప్ప వేదాంతులుగా, పండితులుగా మహాత్ములుగా కీర్తించబడుతుంటారు. ఆచార్యోత్తములు వారు, వీరికుండే జ్ఞానాన్ని శాస్త్రజ్ఞానం అంటారు. శాస్త్రములను అధ్యయనం చేయటంద్వారా తాము పొందిన ఆ బ్రహ్మజ్ఞానాన్ని ప్రజలకు ప్రభోదిస్తూ భక్తులను జ్ఞాన మార్గంలో, మోక్షపధం వైపు మళ్ళిస్తూ, భగవంతుని ప్రతిరూపంగా పూజింపబడుతుంటారు. విషయజ్ఞానం కన్నా

శాస్త్రజ్ఞానం ఎంతో గొప్పది, విలువయినది అయినప్పటికి ఆ జ్ఞానం కూడా అసంపూర్ణమనే చెప్పబడుతున్నది. శాస్త్రముల ద్వారా అధ్యయనం చేసిన దానిని సాధన చేస్తూ, అనుష్ఠానం చేసి "అహం బ్రహ్మాస్మి" అనే బ్రహ్మానుభూతిని పొందేదే నిజమయిన సంపూర్ణమయిన జ్ఞానం అని చెప్పబడుతున్నది. దానినే అనుభవజ్ఞానం అంటారు.

శ్రీ రామకృష్ణపరమహంస, శ్రీ రమణమహర్షి మొదలయిన మహాత్ములకు ఉన్నది 'అనుభవ జ్ఞానం'. వారు ఏ శాస్త్రములను, వేదములను అధ్యయనం చేయలేదు. కేవలం వారి అద్వితీయమయిన సాధనల ద్వారా పొందిన అనుభవజ్ఞానమే వారిని మహాత్ములుగా తీర్చిదిద్దింది. అందుచేతనే వారికున్న ఆ అనుభవజ్ఞానం ముందు శాస్త్రములను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన పండితులు కూడా పాదాక్రాంతులయినారు.

సాధన, అనుష్ఠానం మానవులను మహాత్ములుగా మారుస్తుంది. వేదములను అధ్యయనం చేసి, వేదికలెక్కి అద్భుతంగా ఉపన్యాసములు చెప్పినంత మాత్రాన మహాత్ములు కాజాలరు. ఎంతవరకూ సాధన, అనుష్ఠానం ఉండదో అంతవరకు వారి మాటలకు, ప్రభోధాలకు విలువుండదు. వారు సమాజాన్ని జాగృతి చేయలేరు, మార్గదర్శకులు కాజాలరు. అనుష్ఠానం లేని అధ్యయనం మందుగుండు లేని తుపాకి వంటిదని పెద్దలు అంటారు. అది శబ్ధం చేస్తుందే తప్ప పేలదు. అదే విధంగా అనుష్ఠానం లేని వేదాంతం కళాయిలేని పాత్రలో పోసిని పప్పపులుసు వంటిది. ఎంత బాగా చేసినా రుచిగా వండినా అది చెడిపోతుంది. కాబట్టి సాధన, అనుష్ఠానం తప్పనిసరిగా ఉండాలి.

భారతీయ ఏకాత్మకు ప్రతీకగా కొనియాడబడి ప్రపంచ తాత్వీకుల్లో దార్శనీకులలో ప్రధమస్థానం పొందిన జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులవారు యావత్ భారతదేశాన్ని కాలినడకతో చుట్టి తమ అద్వైత బోధలతో సమాజాన్ని జాగృతి చేసారు. సనాతనధర్మాన్ని పునఃప్రతిష్ఠించి, పతనోన్మభవమైన జాతిని సంరక్షించిన ఆచార్యులు, ఏ అద్వైత సిద్దాంతాన్ని తాను ప్రతిపాదించి ప్రభోదిస్తూ ఉన్నారో ఆ భావం శంకరులహృదయంలో స్థిరపడనందున సాక్షాత్తు ఆ శంకరుడు, పరమశివుడే చండాలుని రూపంలో ఎదురువచ్చి వారికి జ్ఞానోదయం కలిగించారు. 'అహంబ్రహ్మాస్మి' అనే భావన అనుభవంలోనికి, అనుభూతి కలగకపోయినట్లయితే శంకరులు ఈ సమాజానికి మార్గనిర్ధేశకాలు ఏ విధంగా కాగలుగుతారు? కాబట్టి ఎంతెంత శాస్త్రజ్ఞానము సంపాదించినా, అనుభవజ్ఞానం ఉంటేనే జ్ఞానం పరిపూర్ణమవుతుంది. సద్గురు మహర్షి శ్రీ మలయాళస్వాముల వారు, సమర్ధ సద్గురు శ్రీ రామదాసు వారు శ్రీ శివానందస్వామి, శ్రీ వివేకానంద స్వామి మొదలయిన మహాత్ములందరూ ఈవిధమయిన

పరిపూర్ణమయిన జ్ఞానాన్ని పొందినవారే కాబట్టి వారు ఈ సమాజాన్ని జాగృతి చేసి మార్గదర్శకులు, మార్గనిర్ధేశకులు అయ్యారు. అందువల్లనే ఈ నాటికి వారిని మనం నిత్యం స్మరించుకుంటున్నాము.

శ్రీ సమర్థసద్గురు రామదాసు వారు గౌతమినదీ సంగమంలో నడుమలోతు నీళ్ళలో నిలబడి ధ్యానంచేసి సిద్ధిని పొందిన మహాత్ములు. 'దాసబోధ' వంటి గ్రంథాలను ఎన్నింటినో రచించారు. హింధూధర్మపరిరక్షణకై మహారాష్ట్రంలో లెక్కలేనన్ని మఠములను, రామమందిరాలను, వ్యాయామశాలలను నిర్మించారు. జీవితమంతా అంకితంచేసి, చత్రపతి శివాజి ద్వారా ధర్మపరిరక్షణకై పాటుపడ్డారు.

శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాముల వారు తిరుమల గోగర్ణంలో 12 సంవత్సరాలు తపస్సుచేసి సిద్ధిని పొంది 'చరాచరసుఖభిలాషిగా', 'వేదాంతతమే బాస్కరులుగా' కీర్తి గడించారు. ఎన్నెన్నో గ్రంధాలను ప్రకటించారు. 'భగవద్గీతకు భాష్యం స్వామి వారి జీవితం' అని శ్రీ స్వామి శివానందుల వారిచే కొనియాడబడినారు. స్త్రీ, శూద్రులచే భగవద్గీతను చదివించి వారి ఆత్మోన్నతికి నడుంకట్టి సమాజసేవ మహాత్ములకు ఆదర్శమని చాటి చెప్పారు.

శ్రీ స్వామి వివేకానందుల వారు తమ గురువయిన శ్రీ రామకృష్ణ పరమహంస వారి ఆశీస్సులతో యావత్ భారతదేశాన్ని తమ స్ఫూర్తివంతమయిన ప్రభోధాలతో యువతను చైతన్యవంతులను చేశారు. విదేశాలలో సైతం భారతీయ సనాతనధార్మాన్ని ఎలుగెత్తిచాటి జీవితమంతా దీన, దళితసేవకు అంకితమయ్యారు. ఎన్నేన్నో గ్రంధాలను ప్రకటించినారు.

శ్రీ స్వామి శివానందుల వారు వృత్తిరీత్యా డాక్టరు ప్రవృత్తిరీత్యా మహాత్ములు, ఆకలిదప్పలను లెక్కచేయక అహర్నిశములు తీవ్రమయిన సాధన చేసి ఆత్మసాక్షాత్కారాన్ని పొందినవారు 300 కి పైగా గ్రంధాలను రచించినారు. తాను తరించి ఇతరులను తరింప చేయాలని అనే మహర్షుల సూక్తిని అనుసరించి లోకకళ్యాణానికై నిష్కామసేవలందించి నారు. తాము వెళ్ళిన ప్రతి చోటా రోగాలకు మందులను, భవరోగులకు వేదాంతాన్ని అందించారు.

కాబట్టి తాము ఏ శాస్త్రములో నిష్ణాణుతులయినా, వేదవేదాంగములను అధ్యయనం చేసినా, తపస్సుచేసి సిద్ధిని పొందినా, ఆచరణ ప్రధానం. అదే నిజమయిన జ్ఞానం. మహాత్ములందరూ కూడా మోక్షము కంటే సమాజసేవ సర్వోత్కృష్ఠమయినది అనే పరిపూర్ణమైన జ్ఞానం కలిగినవారు కాబట్టే వారి జీవితమంతా సమాజసేవకోసం తపించారు. అట్టి జ్ఞాన మూర్తుల జ్ఞాన ప్రకాశమే ఈ సమాజానికి మార్గదర్శకము. మనందరికి శ్రీ రామరక్ష.

**జూన్ నెలలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రవచనాలు ప్రారంభమవుతాయి. తేదీలు తరువాత తెలియపర్చబడును.**

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## సవరణ

ది॥ 20-02-2005 రమణ భాస్కర సంచికలో "ఆత్మ నివేదనే, భక్తిమార్గం" అనే శీర్షికలో "చిలుకకు మాటలు నేర్పితే రామా, కృష్ణా అంటుంది. కాని పిల్లి గొంతు పట్టుకుంటే పై మాటలు రావు కీస్, కీస్ మంటుంది" అనే వాక్యానికి బదులు "పిల్లికి మాటలు నేర్పగలమా?" అనే పదం పొరపాటున ముద్రితమైనది. పాఠకులు దీనిని గమనించకోరుతున్నాము.

**- ఎడిటర్**

---

శ్రీరస్తు　　　శుభమస్తు　　　అవిఘ్నమస్తు

# నవ గ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వానము

### చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానం, జిన్నూరు

**ఆదిత్యాయచ సోమాయ, మంగళాయ బుధాయచ**
**గురుశుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః**

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ పార్థివ నామ సంవత్సర వైశాఖ బహుళ సప్తమీ అనగా ది. 30-05-2005 సోమవారం ఉదయం గం॥లు 8-17 ని॥లకు శతభిషా నక్షత్ర యుక్త మిధున లగ్న మందు శ్రీశ్రీశ్రీ సద్గురు నాన్నగారిచే నిర్మింపబడిన దేవస్థాన ఆఫీస్ రూమ్, మరియు నవగ్రహ మండపమునకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమములు అత్యంత వైభవముగా జరుపబడును. కావున యావన్మంది భక్తులు విచ్చేసి కార్యక్రమములను తిలకించి స్వామివారల అనుగ్రహమునకు పాత్రులు కాగలరని కోరుచున్నాము.

**ఆలయ అభివృద్ధి కమిటి**
**జిన్నూరు**

మంగళం మహత్
శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ



## చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానం, జిన్నూరు

# కార్యక్రమములు

ది. **28-05-2005** శనివారం ఉదయం గం॥లు 7-20 ని॥లు దేవాలయం నుండి, గోమాత, మంగళ వాయిద్య, పూర్ణకుంభ వేదపఠనము, గ్రామస్థులచే గ్రామప్రదక్షణ, యోగశాల ప్రదక్షిణ ఉదయం గం॥లు 8-30 ని॥లకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, రక్షాబంధనము, ఋత్విక్ వరుణలు, దీక్షాధారణ, పంచగ్రవ్య ప్రాశన, చతుఃషష్ఠీ యోగినీ మండపము, క్షేత్రపాలక మండపము, వాస్తు మండపము, నవగ్రహ మండపము, ఆరాధనలు, జలాధివాసం, నవగ్రహ జపములు నీరాజన, మంత్రపుష్ప తీర్థ ప్రసాదము వినియోగము. సాయంత్రం గం॥ 5-00లకు అగ్నిప్రతిష్ఠాపన, సనకవతో భద్రమండపఆరాదన, మండప పునఃపూజలు, హోమములు, జపములు క్షరాధివాసం, బలిహరణ నీరాజన, మంత్రపుష్ప చతుర్వేదస్వస్తి దర్బారు సూవతీర్థ ప్రసాద వినియోగము.

**సాయంత్రం:** పాలు అందరూ తెచ్చుకొని విగ్రహముల మీద పోసుకోవచ్చును.

**29-05-05** ఆదివారం ఉదమం గం॥ 7-30 ని॥లకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, పంచగ్రవ్యప్రాశన, నవగ్రహజపములు, మండప పునఃపూజలు, దాన్యాధి వాసం హోమములు, వేదస్వస్తి నీరాజన మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగము.

**ఉదయం :** ధాన్యం అందరూ తెచ్చుకొని విగ్రహముల మీద పోసుకోవచ్చును.

**సాయంత్రం :** 5-00 గం॥లకు మండప పునః పూజలు, పుష్పాధివాసం, హోమములు, వేదస్వస్తి, పంచశయ్యాధావాసం నీరాజన, మంత్రపుష్ప దర్బారుసేవ, చతుర్వేదస్వస్తి బలిహరణ తీర్థప్రసాద వినియోగము.

**సాయంత్రం:** పువ్వులు, పూలదండలు, నూతన వస్త్రములు అందరూ తెచ్చుకొని విగ్రహముల మీద వేయవచ్చును.

ది॥ **30-05-05** సోమవారం ఉదయం 6-00 గం॥లకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, పంచగ్రవ్యప్రాశన, మండపపునః పూజలు, నవగ్రహ జపములు, హోమములు, అనంతరం గం॥ 8-17 ని॥లకు నవగ్రహముల ప్రతిష్ఠ మహోత్సవము, పూర్ణాహుతి, కళాన్యాసము, కుంభము, అవబృధస్నానం, నీరాజన, మంత్రపుష్ప, ఆశీర్వచనము మంగళహారతి, తీర్థప్రసాద వినియోగము.

**పై కార్యక్రమములు దువ్వ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ జంధ్యాల జగన్నాధ శర్మగారి బ్రహ్మత్వంలో జరుపబడును.**